క్లుప్తంగా

లారీ డ్రైవర్ కుటుంబానికి గ్రామస్తుల చేయూత



శ్రీనివాస్‌చారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లారీ ఓనర్స్, డ్రైవర్లు, గ్రామపెద్దలు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాస్‌చారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తోటి డ్రైవర్లు, ఓనర్లు, యువకులు, గ్రామ పెద్దలు అంతా కలిసి మంగళవారం మృతుడి కుటుంబానికి రూ. 45 వేలు ఆర్థికసాయం అందజేసి చేయూతనందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌చారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లా ఉపేందర్, గన్నా అజయ్, గన్నా ప్రవీణ్, సత్యనారాయణ, వీరయ్య, ఆది, నరేష్, శ్రావణ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : మసీదుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను టీపీసీసీ జాయింట్ సెక్రటరీ అజీజ్ పాషా కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల అభివృద్ధికి సహకరించాలని, అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములను కాపాడాలని కోరారు. ఎస్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే ముస్తఫా, రఫీ, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు వినతి

కోదాడరూరల్ : వారసత్వంగా ఇద్దరికి భూమి చెందాలని వీలునామా ఉన్నప్పటికీ ఒక్కరికే భూమిని రిజిస్ట్రేషన్ చేసిన అనంతగిరి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని నెలకకుర్తి ఉషారాణి మంగళవారం ఆర్డీఓ సూర్యానారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి వీరయ్య పేరు మీద 12 ఎకరాల భూమి ఉండగా అతని మరణానంతరం కుమారుడు, కుమార్తెను అయిన తనకు చెరో 6 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయాలని వీలునామా రాశారన్నారు. తనకు తెలియకుండా తన సోదరుడు అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాడని తెలిసి గత నెల 31 తహసీల్దార్‌కు విషయాన్ని చెప్పినప్పటికీ వినకుండా ఈ నెల 2న డబ్బులకు ఆశపడి రిజిస్ట్రేషన్ చేసిందని ఆమె ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని తనకు రావాల్సిన భూమిని తనకు వచ్చే విధంగా చూడాలని కోరారు.

ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వే

నడిగూడెం : మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో మంగళవారం ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్ ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా రెండోసారి ఈ సూపర్ చెక్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శోభన్, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గరిడేపల్లి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్ తెలిపారు. మండలంలోని పాత అప్పన్నపేట గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎడవెల్లి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వెయ్యి గొంతులు, లక్ష డప్పుల రథయాత్ర ప్రారంభం



రథయాత్రను ప్రారంభిస్తున్న ఇంజమూరి మల్లయ్య

నేరేడుచర్ల : వెయ్యి గొంతులు, లక్ష డప్పుల రథయాత్రను మంగళవారం నేరేడుచర్లలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణనే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యడవల్లి చంద్రయ్య, వడ్లమూడి ఉపేందర్, పల్లెపంగు నాగరాజు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, మంద కాంతయ్య, నందిపాటి హిందూజ తదితరులు ఉన్నారు.

కలగానే వంతెన నిర్మాణం

- రావిపహాడ్ పెద్ద వాగుపై బ్రిడ్జి లేక ప్రజలకు ఇబ్బందులు
- వర్షాకాలంలో రాకపోకలు బంద్
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని పాలకులు, అధికారులు
- సిరికొండ- రావిపహాడ్ రోడ్డు సైతం అధ్వానం



రావిపహాడ్ పెద్ద వాగు

మోతె : ప్రతి ఐదేండ్ల కొకసారి ప్రభుత్వాలు మారుతున్నాయి.. నూతన ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్నారు. కానీ ప్రజా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మోతె మండలంలోని రావిపహాడ్ పెద్ద చెరువు వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఆ ప్రాంత ప్రజల కలగానే మిగులుతోంది. పూర్వం ప్రజలు రావిపహాడ్ గ్రామం నుంచి మోతె మండల కేంద్రానికి చేరుకోవాలంటే రావిపహాడ్ పెద్ద చెరువు వాగు దాటి డొంక మార్గం గుండా నందిగామవారి దొడ్ల నుంచి సిరికొండ మీదుగా నడిచి వెళ్లేవారు. ఈ డొంక దారిని గత 30 ఏళ్ల క్రితం రహదారిగా మార్చారు. కానీ వాగుపై వంతెన నిర్మించలేదు.

రైతులకు అవస్థలు..

కాగా, రావిపహాడ్ గ్రామంలో పెద్ద చెరువు విస్తీర్ణం 300 ఎకరాలు ఉంది. ఈ చెరువు కింద సుమారుగా 7 వందల ఎకరాలకు పైగా సాగు అవుతోంది. రావిపహాడ్ పెద్ద చెరువు సాగు నీరు రావిపహాడ్, అప్పన్నగూడెం, మేకలపాడుతండా, సిరికొండ, బుర్కచర్ల గ్రామాల పరిధిలోని వ్యవసాయానికి వినియోస్తారు. అయితే వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వ్యవసాయ పనుల నిమిత్తం వాగు దాటి వెళ్లే రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఇక వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అనేకసార్లు రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకొనే నాథుడే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ చూపి రావిపహాడ్ పెద్ద చెరువు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా సిరికొండ నుంచి రావిపహాడ్ వరకు ఉన్న మెటల్ రోడ్డు అధ్వానంగా తయారై ఇబ్బందులు పడుతున్నామని బీటీ రోడ్డుగా మార్చాలని వేడుకుంటున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు

వర్షాకాలంలో చెరువు నిండి అలుగు పోస్తే రావిపహాడ్ వాగులో 8 నుంచి 10 అడుగుల లోతు నీరు ప్రవహిస్తుంది. దీంతో పశువులు, మేకలు, గొర్రెలు, రైతులకు ఇతర గ్రామాల ప్రయాణికులకు నెలల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. వరద తగ్గేంతవరకు అలుగు దాటి పోవడం కష్టంగా ఉంటుంది. ప్రత్యామ్నాయ మార్గం ద్వారా పొరుగు గ్రామం నుంచి దూరం అయినా ప్రయాణించి వెళ్లాల్సి వస్తుంది.

– కోడి గంగయ్య, రైతు, మాజీ సర్పంచ్

బ్రిడ్జి నిర్మించాలి

రావిపహాడ్, సిరికొండ గ్రామాల మధ్య ఉన్న పెద్ద చెరువు వాగుపై వంతెన నిర్మించాలి. అలాగే ఇరుపక్కల బీటీ రోడ్డు నిర్మిస్తే మోతె, ఆత్మకూర్(ఎస్) మండలాల ప్రజల ప్రయాణానికి సులువుగా ఉంటుంది. వర్షాకాలంలో రైతులు, పశువులకు ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై వంతెన, బీటీ రోడ్డు నిర్మించాలి.

– కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, రైతు, రావిపహాడ్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలి

- జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని 9వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు సిబ్బంది మధ్యాహ్న భోజనం అందించడాన్ని గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం కేంద్రాల నిర్వహణపై అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి



కోదాడ : రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్

కోదాడరూరల్ : వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ సూచించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పలు వాహనాల డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్ని సరిగా ఉండేవిధంగా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా వాహనం ఆర్సీ, లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. అనంతరం హెల్మెట్ తప్పక ధరిస్తామని వాహనదారులతో ప్రమాణం చేయించారు. పోలీసులు శ్రీనివాస్, ఉపేందర్, జహీర్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ చలిగంటి నరేష్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలు సరిగా పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ఫోన్ మా ట్లాడొద్దని, పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



పాలకవీడు : చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. మండలంలోని గుండెబోయినగూడెం గ్రామానికి చెందిన భూతరాజు నాగలక్ష్మి బ్రెయిన్ డెడ్ కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 60 వేల చెక్కును మంగళవారం వారి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో యాతం శ్రీనివాస్, ముండ్ల నగేష్, కల్లెం వెంకట్ నాయుడు, కమల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామంలో గుజ్జ శ్రీనివాస్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.60 వేల చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుజ్జ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రామాపురం గ్రామానికి చెందిన వేముల బాలుకు మంజూరైన రూ.34,500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రణపంగ నాగయ్య, నాయకులు పాలయి కృష్ణమూర్తి, ఇంజమూరి పున్నయ్య, జాను, కృష్ణ, శ్రీనివాస్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పాదయాత్ర చేస్తున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారులు

పాలకవీడు : తెలంగాణ రాష్ట్ర సాధనకు పాటుపడిన మలిదశ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం చైర్మన్ రాపోలు నవీన్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. హామీలు నెరవేర్చాలని మంగళవారం మండలంలోని జాన్‌పహాడ్ దర్గా నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ సంఘం నాయకులు కుమారస్వామి, పనాస ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు లక్ష్మి, వెంకట్, వెంకటేశ్వర్లు, అయ్యప్ప, రాజేష్, సైదులు, సతీష్, సీతారాములు, ఇంతియాజ్, అంజి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులపై కలెక్టర్, పీసీబీకి ఫిర్యాదు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల రైస్ మిల్లుల కాలుష్యం నుంచి తమను కాపాడాలని కోరుతూ తమ్మర, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. మిల్లుల నుంచి బూడిద, వ్యర్థ జలాలతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బూడిద గాలికి వచ్చి ఇళ్లపై పడుతుందని, వాహనదారుల కళ్లతో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లు ప్రసాద్, హేమ, వీరస్వామి, పద్మ, సాంబశివరావు ఉన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని ఎంపీడీఓకు వినతి

గరిడేపల్లి : ఎన్నికల్లో గరిడేపల్లి ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో రిజర్వేషన్‌ను ఎస్టీలకు కేటాయించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ సునీతకు పలువురు వినతిపత్రం అందజేశారు. గత 50 సంవత్సరాల నుంచి ఎస్టీ రిజర్వేషన్ రావడం లేదని వారు తెలిపారు. కార్యక్రమంలో గుగులోతు వెంకటేశ్వర్లు, నాగరాజు, జగ్గునాయక్, రామకోటి నాయక్, మిట్టనాయక్, సైదానాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో చిన్నారికి అక్షరాభ్యాసం



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కాశీం

మునగాల : సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా మునగాల మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మాతంగి అంబేద్కర్ కుమారుడు రేద్వేద్‌కు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ చింతకింది కాశీం చేతుల మీదుగా మంగళవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎల్‌ఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జె.నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ.. రుద్వేద్ వందేళ్ల చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాలలో అక్షరాభ్యాసం చేసుకోవడం ఓ గొప్ప అవకాశమని కొనియాడారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



సిరికొండలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మోతె : మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు దామల్ల కోటేశ్వరరావు, టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శ్రీను, శ్రీనివాసచారి, మారయ్య, రమేష్, సతీష్, సాజిద్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

చిలుకూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకిరామాచారి ఆరోపించారు. మంగళవారం చిలుకూరు మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని అన్నారు. రైతు బంధు ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి నేడు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అంబాల రాంబాబు, సహకార సంఘం చైర్మన్ అలసకాని జనార్దన్, పార్టీ జిల్లా, మండల నాయకులు కస్తూరి నర్సయ్య, దొడ్డా సురేష్‌బాబు, భట్టు శివాజీ, షేక్ జానిమియా, కొడారు రాంబాబు, అచ్చయ్య, శ్రీను, అన్నపూర్ణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన సివిల్ సప్లయ్ హమాలీలు



సమ్మె విరమించి మిఠాయిలు తినిపించుకుంటున్న సీపీఐ, యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : సమ్మె చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీల పక్షాన నిలిచిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. సివిల్ సప్లయ్ హమాలీల కూలి రేట్లు పెంచేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయడంతో మంగళవారం హుజూర్‌నగర్‌లో హమాలీలు చేస్తున్న సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరం వద్ద మిఠాయిలు పంపిణీ చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జరిపిన చర్చలకు అనుగుణంగా సివిల్ సప్లయ్ హమాలీలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, జక్కుల శ్రీనివాస్, హమాలీ సంఘం నాయకులు బాణోత్ సైదులు, పండుగ వెంకన్న, జక్కుల మల్లయ్య, బాలాజీ, శీలం వెంకన్న, తోట లక్ష్మయ్య, చింతకాయల పిచ్చయ్య, చింతకాయల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల అరెస్ట్



బియ్యం తరలిస్తున్న డీసీఎం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

కోదాడరూరల్ : తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ గత వారం రోజులుగా కోదాడ పట్టణంలోని ఎంఎల్‌సీ పాయింట్ వద్ద సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మె చేస్తున్నారు. మంగళవారం బిహార్ కూలీలతో గ్రామాలకు బియ్యం తరలిస్తున్న డీసీఎంను వారు అడ్డుకొని నిరసన వ్యక్తం చేయడంతో పట్టణ పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు కొండలు, గౌరీనాయుడు, శ్రీనివాసరావు, కల్యాణ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

మేధావుల సంఘీభావ సభను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 11న ఎస్సీ వర్గీకరణ అమలు కోసం నిర్వహించబోయే మేధావుల సంఘీభావ సభను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రొఫెసర్ ఖాసీం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభకు మాదిగ ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు ఏపూరి పర్వతాలు, పిడమర్తి సైదులు, చేకూరి రమేష్, బొల్లికొండ కోటయ్య, నందిగామ ఆనంద్, పులి నరసింహారావు, మాదాసు బాబు, గంధం బుచ్చారావు, బొడ్డు హుస్సేన్, అక్షపతి, సైదులు ఉన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి

నేరేడుచర్ల : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటం అప్రజాస్వామికమని బీజేపీ మండల అధ్యక్షుడు పార్తనబోయిన విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పల్లేపంగ వీరబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చింతలచెరువు సతీష్, దళితమోర్చా అధ్యక్షుడు ఉప్పెల్లి ప్రవీణ్, సోమనబోయిన నవీన్, చిలకరాజు కరుణాకర్, కిరణ్, రాములునాయక్ ఉన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ నాయకులు నిరసన పేరుతో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై రాళ్లతో దాడి చేయడాన్ని, కార్యకర్తలను గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని అన్నారు. నాయకులు నాగరాజు, గోపి, లక్ష్మణ్, నాగేంద్ర, నగేష్, మురళి, నాగరాజు, ఉపేందర్, సింగ్, విజయ్, మట్టయ్య, గోపి, సిసింద్రీ పాల్గొన్నారు.

శోభాయాత్రకు సర్వం సిద్ధం

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్ర స్వామి బుధవారం నిర్వహించే స్వామివార్ల శోభాయాత్రకు సర్వం సిద్ధమైంది. దీని కోసం ఆలయంలో స్వామివారి వాహనాలను శుభ్రపరిచి రంగులతో ముస్తాబు చేస్తున్నారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, పూలమాలలు సిద్ధం చేస్తున్నారు. దేవాలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధులన్నీ శుభ్రపరచి అందమైన రంగవల్లులు వేసి స్వామివారికి స్వాగతం పలకాలని మహిళలకు ఆలయ అధికారులు సూచించారు.

వైభవంగా మంజలి ఉత్సవం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ వేణుగోపాల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం అర్చకులు, భక్తులు మంజలి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, గోదాదేవికి పంచామృతాభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు చేశారు. శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో అర్చనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎరగాని గురువయ్య, ఈఓ ఎంపీ లక్ష్మణరావు ధర్మకర్తలు, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, వెంకటేశ్వరరావు, గోపాలం, పూర్ణా, ప్రవీణ్‌గుప్తా, సైదులు, గణేష్, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో 108 మంది మహిళలు హనుమాన్ చాలీసాను 108 సార్లు సామూహికంగా పారాయణం చేశారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులకు తమలపాకులు, అరటి పండ్లతో పూజలు చేశారు. అనంతరం మహిళలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు హనుమాన్ కండువాలను అందించారు. శ్రీజ్ఞాన సరస్వతి, శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫిజియోథెరపి కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : ఫిజియోథెరపి కిట్లను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చత్రు నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ఫిజియోథెరపి చికిత్స విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ మంజూరుపై హర్షం

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నడిగూడెంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పక్కా భవనం నిర్మాణానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రూ.20 లక్షలు కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పల్లపురెడ్డి సురేందర్‌రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, పల్లపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రియాంకగాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు

నడిగూడెం : కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు రమేష్ బిదురి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండు మహేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎల్‌టీ -5 వైర్ లైన్ లాగుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ, చంద్రం హోటల్ బజార్, పీర్ల కొట్టం, గాంధీ పార్క్, సాయిబాబా గుడి ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారం పరిధిలోని మిట్టగూడెం ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో సైదానాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా బోధన తీరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. హెచ్‌ఎం విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నర్సయ్యకు నివాళి

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామంలో యానాల నర్సయ్య 8వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు, జిల్లా కమిటీ సభ్యులు షేక్ యాకూబ్, దుగ్గి బ్రహ్మం, సీపీఎం సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నవీన్, యానాల సోమయ్య, సైదయ్య పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని వినతి

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించి నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శమని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ కవితకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, అంజిరెడ్డి, వెంకన్న, వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, నబిసాహెబ్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరణ

మఠంపల్లి : సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25 నుంచి 28వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్, మండల కార్యదర్శి బాలునాయక్ కోరారు. మంగళవారం మఠంపల్లిలోని సీపీఎం కార్యాలయంలో మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు సయ్యద్‌రసూల్‌మియా, పాడిశెట్టి రాము, ఎం.రాజు, జయరాజు, బాలు పాల్గొన్నారు.